కథానిక

# జమాబందీ

పి. వి. పల్లి

వేసంకాలం. అగ్గికత్తెర్లుకూడాను. పట్నం యింకా రెండుమైళ్లువుంది. క్రిందిని గండ్ర యిసుక. కాలేకాళ్ళతో, వెయ్యలేక వెయ్యలేక అడుగులువేస్తున్నాడుపంతులు. కాలప్రవాహంలో నలభైతేరేళ్లు యీదేడు. వేడిగాడ్పులుకి మొహం పేలవమయిపోయింది. పెదవులు పొడారి పోయాయి. నడుస్తున్నాడు పంతులు. నమ్మిన నౌఖరు వెంకన్న వెనకనుండివస్తున్నాడు. వాడు మాత్రం చిన్నవాడుకాడు; కాని నలభయి వుండొచ్చు. దస్తరాలునెత్తిమీదపెట్టుకుని పంతులుగారితోసమానంగా నడుస్తున్నాడు. పంతులుకు జోడులేదు. తనకీలేదు. అయినా ఇద్దరూ జోరుగా నడుస్తునేవున్నారు.

"ఇంకా మైలున్నర నడవాలిరా వెంకన్నా" అన్నాడు పంతులు, పైమీదనున్న అంగవస్త్రముతో ముఖంతుడుచుకుంటూ.

"అవునుబాబూ! యీ దిక్కుమాలిన జమాబందీ మనకొంపతీసేత్తుందాది..." చేతికర్ర నేలకి కొట్టుతూ తూలినడుస్తూ అన్నాడు వెంకన్న.

"ఏంచేస్తాం, అనుభవించడమే. యింతదూరం నడిచివచ్చాక, పనియేమన్నా అవుతుందేమో అంటే, అదీవుండదు. అధికార్లముందు చేతులు కట్టుకు నిలబడేసరికే సరిపోతుంది. ఇంతకీ పని అసలేలేదు. ఊరికనే తిప్పించంపుతున్నారు వీళ్లు."

ఆయాసం ఎక్కువయింది, మాట రాలేదు. నోరెండిపోతూంది.

"వెంకన్నా నూతికిపోదాం"అంటూ పొలంలోని నూతిదగ్గరికి చేరుకున్నారిద్దరూ. కడుపునిండా నీళ్లు తాగి మళ్ళీసాగించారు నడక.

పంతులు నడవలేకపోయాడు.

"వెంకన్నా, మరినడవలేను."

"యీ చెట్టుకిందకూచుందాం రండిబాబూ!"

ఇద్దరూ చెట్టుకింద కూచున్నారు.

"అమ్మయ్యా, ప్రాణం తెప్పిరిల్లింది. ఎంత చల్లగావుందీగాలి!"

"అవునుబాబూ, యింకా మైలుదూరంవుంది. బాబూ, నాకు తెలీకడుగుతాను. మనకి ప్రభుత్వంవోళ్లు ఖర్చులిస్తారని తాసిల్దారుగారాపొద్దు మనవూళ్ళో అన్నారుకదా. ఎంత యిస్తారు బాబూ?"

పంతులు నిస్పృహాగానవ్వి, అన్నాడు: "నీ తెలివిగాని, అధికార్లు మనకి యెప్పుడూ యిస్తారనుకోకు. యిచ్చినట్లుమాత్రం సంతకం పెట్టెయ్యాలిమనం—"

"అదేటిబాబూ, ప్రాణాలుపోయేట్లు శ్రమపడి రాత్రీ,పగలూ లెక్కలురాసి, ఈ యెండలో యిలా పనుతూచేస్తూమనం కష్టపడ్డమూ, ఆళ్ళు సొమ్ముతిండమూనా?"

"అంతేరా."

"అదేటిబాబూ!యీ పాలి అల్లా వొదలొద్దు. పుచ్చుకుతీరాలి."

నడక సాగించారిద్దరూ, మళ్ళీ.

"బాబూ! హోటేలుకుపోదాం రండి."

"వొద్దురా. ఆకలిగాలేదు."

అర్థమయిపోయింది వెంకన్నకి; పంతులుగారు డబ్బులేకనే అలాగంటున్నారని.

"నాకుతెల్దాబాబూ! నామాట కొట్టెయ్యకండి. నాకాడడబ్బులున్నయి."

"నీ సొమ్ము తినడమేమిట్రా?"

"అమ్మయ్యో, యెంతమాటన్నారు. తమకు అలా నీరసంగా ఉంటే, నేను చూడగలనా? రాండి బాబూ—"

వెంకన్న మాటని తోసెయ్యలేకపోయాడు పంతులు. వాడి ఉదార స్వభావానికి మెచ్చుకున్నాడు. వాడు మాత్రం పెద్ద జీతగాడా? తనతోడివాడే.

* * *

"ఏమండీ శంకరం పంతులుగారూ! యింత వేగం దయచేశారు? సాయింత్రం రాలేకపోయినారూ?"

ఇనస్పెక్టరు మాటలోని గంభీరం, హేళనా, ఈసడింపూ పంతులుని నిలువునా దహించి వేశాయి. పైమీద అంగవస్త్రంతో ముఖం తుడుచుకున్నాడు.

అధికారి గుమ్మంలోని యీజీచైర్లో కూచుని, ముందుబల్లమీద కాళ్లు పెట్టుకుని సిజరు సిగరెట్టు పొగవదుల్తున్నాడు. పంతులు వరండా ముందు వున్న ఎండకి బాగా వేడెక్కిన సిమ్మెంటుగచ్చు మీద నిలబడి అలా చూస్తున్నాడు.

"మాటాడరేం పంతులుగారూ?" మళ్ళీ గద్దించాడు ఇన్స్పెక్టరు.

"చిత్తం. నడిచి రావడంలో ఆలస్యమైంది,"

"అవుతుందయ్యా–నిక్కీ నీలగీ జయలుదేరితే అవదూ. తెల్లవారు జామున బయలుదేరితే వేగంగానే చేరుకోవచ్చుగా?" ప్రశ్నార్థకంగా చూశాడు పంతులువేపు.

ఆ చూపుల్లో క్రౌర్యం, దుర్మార్గత్వం ప్రతిబింబించుతున్నాయ్. పంతుల్ని దహించి వేశాయి ఆ చూపులు.

అవును. అతనికేం తెలుసు పంతులు పడ్డ బాధ. రెండు దినాలు దాకా రానుకదా అని యింటివద్ద వున్నవాళ్ళకి నాలుగూ అమర్చిపెట్టడానికి రెండు దినాలనుండీ శ్రమపడితే, ఇవాళ తొమ్మిది గంటలకి తను కృతకృత్యుడయ్యాడు. ఇక్కడ తనకిచ్చేవాళ్లెవరూ లేరుగా! తనకోసం కొంత మిగుల్చుకుని మరీబయలుదేరాడు. అయినా తను మిగుల్చుకున్నది రెండు రూపాయిలే. అందుచేత యీ రాత్రీ, రేపూ ఖర్చుపెట్టుకుందామని అనుకున్నాడు. అందుకే మధ్యాహ్నం భోజనం మానెయ్యబోతే, పాపం! వెంకన్న అభిమానించాడు.

ఇంటిదగ్గర, తను వస్తున్నప్పుడు, పెద్దపిల్ల రజస్వల అయింది. అయినా ఆగకుండా వెళిపొచ్చాడు పంతులు. అక్కడ యేం చికాకులు పడుతున్నారో వాళ్లు.

అధికారి గద్దమాయింపుతో యివన్నీ పంతులు బుర్రలో మెదిలాయి. అయినా యేంచేస్తాడు? పెదవి విరిచి, జాలిగా చూస్తూ ఊరుకున్నాడు.

వెంకన్నకి కోపం వచ్చింది. ఎంత అధికారి అయితేమాత్రం తన పంతుల్ని అలా చిన్నబుచ్చడమా? అయినా తను ఏంచెయ్యగలడు? అస్వంత్రుడు! యేమన్నా అన్నట్లయితే పంతులు తనని కోప్పడతాడు. ఎప్పుడూ ఎవరికీ ఎదురాడరాదంటాడు. అంచేత తన కోపాన్నంతా దిగమింగుకున్నాడు.

"దయచేయండి గుమ్మంలోకి. ఏదీ యీఫసలీ తాలూకు లెక్కలు చెక్కింగు చేస్తాను."

తెల్లకాగితాలమీద ఎర్రసిరాతో రూళ్లు తీసి, ముత్యాలాంటి అక్షరాలతో, అంకెలతో– ఎంతో శ్రమపడి రాసిన లెక్కలవి. మంచి అట్టవేసి తయారుచేశాడుపుస్తకాలని. అధికారి (ఆర్. డి. ఓ.) తన రికార్డు చూసి మురిసిపోతాడని ఉవ్విళ్లూరేడు దారిపొడుగునా! ఆ పుస్తకాల్ని పదిలంగా ఇన్స్పెక్టరు చేతికిచ్చాడు.

అటూఇటూ నాలుగుసార్లు పేజీలు త్రిప్పిచూసి తన బండ కలంతో సిరా ముద్దలు ముద్దలుగా పడుతున్నా చూడక ఏదేదో నాలుగు పంక్తులు గీకి క్రిందని పొట్టి అక్షరాలతో తన సంతకం చేశాడు.

పంతులు హృదయం ఏడిచింది. తన శ్రమకి తగిన ఫలితం యిదే గాబోలు! తిరిగి మళ్లీ రాయాల్సిందిగా రిమార్కు వ్రాయబడింది. కారణం? అనూహ్యం.

పంతులు, మూడునిమిషాలపాటు శూన్యంగా చూచి, అడిగేడు:

"బాబూ - ఎక్కడ వుంది తప్పు మళ్లీ రాయాలా?"

"నాకేం తెలుసు? అందుమీద రాశాను చూసుకో—"

"అదేదో తెలియడం లేదు—"

"అవును యెలా తెలుస్తుంది?" ఒక్కక్షణం ఆగి—

"ఒరేయ్-అప్పన్నా..."

"చిత్తం సార్—"

"ఏదీ సిగరెట్టుపెట్టె?—" అడుగుతూ కనుసౌంజ్ఞ చేశాడు. వెంకన్న గమనిస్తున్నాడిదంతా.

"ఇలా రావయ్యా నేనిస్తాను—"అని రొంటినుండి డబ్బులుతీసి బంట్రోతుచేతి కిచ్చాడు. పంతులు నిర్ఘాంతపోయాడు.

"ఊరుకోండి బాబూ-నేనిస్తే నేటి, మీరిస్తే నేటి? ఎవరిచ్చినా ఆ అధికార్లకోరికేగదూ."పళ్లు

కొరుకుతూ అన్నాడు. పక్కగా మొహం పెట్టుకుని.

* * *

"నాకు యీ వుద్యోగం యేమీ నచ్చడం లేదు. వెంటనే రిజైన్ యిచ్చేస్తాను—" అన్నాడొక యువకుడు కుర్చీలో కూచుని బల్లమీద పెట్టిన కాళ్లు ఆడిస్తూ. ఆ వ్యక్తికి సుమారు ముప్ఫైయేళ్ళకి దాటవు. చామనఛాయ. కోలగా లొత్తలుపడ్డ ముఖం చేతులకి అక్కడక్కడ యెర్రటి మచ్చలు.

"ఆఁ...ఎంతమాటన్నారు. మీరు లేకపోతే, ఈ రికార్డు చెక్కింగు యెవరు చేస్తారు? కాకపోయినా మీ ఆఫీసులోకల్లా మీరే కాస్త సిన్సియర్‌గా పని చేస్తారని కలక్టరుగారన్నట్టు వినికిడి—" అన్నాడ ప్రక్కగా క్రిందకు కూచున్న ఇన్స్పెక్టరు.

"అయినా యెవడు పడతాడండీ యీ చికాకులు! అందులోనూ యీ రాణా అంత దరిద్రం లాణా మరోటి యేదీ వుండదు" అన్నాడు కోపం చూపుతూ.

ఇన్స్పెక్టరు గుండెలు గతుక్కుమన్నాయి. తనకి మాట వస్తుందని భయపడ్డాడు.

"అవును లెండి. ఈ విలేజి ఆఫీసర్లున్నారే వాళ్ళు రాసేది వాళ్ళకే తెలియదు. మనమేం చెక్ చెయ్యగలం. ఐనా వాళ్ళూ వూరుకోరు లెండి—"

"యెవడిక్కాలండీ—"అంటూ, బంట్రోతు తెచ్చిన షర్బత్ సీసా ఖాళీచేశాడు కలెక్టరాఫీసు గుమాస్తా.

వెంటనే ప్రక్కనున్న ఓ గ్రామాధికారి సిజర్ సిగరెట్ తీసియిచ్చాడు. దాన్ని ముట్టించి,

"ఛా. యిదేం సిగరెట్టయ్యా! కేప్స్టన్ కాదూ"అంటూ దూరంగావిసరేశాడు. వెంకన్న వొడిలోపడిందాసిగరెట్టు. తనకర్రని నిలువుగా పట్టుకుని అడుగుకొసతో ఆ సిగరెట్టుని నలిపి గుండ చేశాడు.

"అసలు, మీరురారంటే నాకుభయమేసింది. యింతపనీ యెల్లాచేయడమా? అని. పరమేశ్వరుడు దయతలిచాడు. కనక మీ రాక, లభించింది మాకు. మా తాసిల్దారుగారు మురిసిపోయారు." అంటూండగానే తాసిల్దారుగారు ఇన్‌స్పెక్టరుగారి గుమ్మంయెక్కారు. ప్రక్కగావున్న మరో కుర్చీలో కూచున్నాడాయన.

వెంకన్న అనుకున్నాడు"గుమస్తా పెద్దవాడా! తాసిల్దారు పెద్దవాడా?"అని. మళ్ళీ తనతో తనే సముదాయించుకున్నాడు యిది జమాబందీ సీజనని.

"ఓ. అప్పుడే నాలుగుగంటలన్నర అయిందే" అన్నాడు కలెక్టరాఫీసు గుమాస్తా తన చేతివాచీ చూసుకుని.

"ఓరే అప్పన్నా! తాసిల్దారుగారికీ, గుమాస్తాగారికీ కాఫీపట్టుకురా" అన్నాడు ఇన్‌స్పెక్టరు.

చుట్టూచేరిన గ్రామాధికార్లముఖాల్లోకి చూస్తున్నాడు అప్పన్న.

"తెః ఎంచండయ్యా — మీకేంటి వూళ్ళేలే రాజాధిరాజులు"అన్నాడు కలెక్టరాఫీసుగుమాస్తా. సిగరెట్టుపొగ సూదిగా మీదకువొదుల్తూ. ఆ సిగరెట్టు ఇన్‌స్పెక్టరుగారిచ్చారు.

అందరూ ముఖాలు దించేసుకున్నారు. మరో గ్రామాధికారి వెంటవచ్చిన వెట్టివాడు, "ఎవరు ఎవరికివ్వడం?" అనుకున్నాడు తనలో. ఆ మూకలో యెవరిచ్చారో గాని రూపాయికాసు పట్టుకుని అప్పన్న పరుగెట్టాడు వీధిలోకి.

తాసిల్దారుగారన్నారు, "శేఖరం! నువ్వు మా ఆఫీసునుండి వెళ్ళిపోయాక బాగా ఎదిగావోయ్."

"అవును. యిందులోనే ఎదగటం" అనుకున్నాడు వెంకన్న.

ఆ మాటకి ఉబ్బితబ్బిబ్బయి, "ఆఁ ఎంతమాటన్నారు. తమచేతుల్లోంచి వెళ్ళినవాణ్ణేకదూ. యిదంతా తమతరిఫేను. తమపేరుచెప్పుకుని ఇలా బతుకుతున్నాను"అన్నాడు కలెక్టరాఫీసు గుమాస్తా శేఖరం.

పంతులుకి ఏదో ఆలోచనతట్టింది. నోట్లోనే గొణుక్కున్నాడు. ప్రక్కనున్న మరో గ్రామకరణం, అతని ప్రక్కవానితో అంటున్నాడు, "అవునుమరి. బాగానే ఆరితేరాడు. కాని మన గొంతులుకోస్తున్నాడు. ,యిదేగాబోలు ఆయన చెప్పినవిద్య"అని. యీ మాటలు పంతులు విని, నవ్వుకున్నాడు. తనుకూడా అలాగేఅనుకున్నాడు కాబోలు!

తాసిల్దారు వెళ్ళిపోయాడు. ఇన్‌స్పెక్టరు

అన్నాడు శేఖరంతో: "యీ రాత్రి మా ఇంట్లో భోజనానికి ఉండిపొండి."

"అబ్బెబ్బె... ఎందుకూ... అయినా... సరే. మావాళ్లువున్నారుకదండీయింకా...." మహా మొహమాటస్తుడికిమల్లే నటించాడు గుమాస్తా.

"అందరూ యిక్కడే తప్పదుమరి. మీరిలా పట్టుపడుతూంటే కాదనడం నాచేత కానిపని."

"అవునవును – ఎందుకు చేతనవుద్దీ పరమాన్నమూ, బూరెలూ అన్నీ వుంటయిగా–" గొణుక్కున్నాడు వెంకన్న. ఎర్రగా చూసేడు పంతులు వెంకన్న వేపు.

"ఎవడది?—" కేకవేశాడు శేఖరం.

"ఏవ్రడా ఆ వెధవ?–" గట్టిగా కేకవేశాడు ఇన్స్పెక్టరు.

"తెలియనివాడు వాడితో నేంటి లెద్దురూ-" అన్నాడు పంతులు.

"అవునయ్యా మీకూ, మీ వెట్టివాళ్ళకీ ఏమీ తెలియవు" అన్నాడు ఈసడింపుగా ఇన్స్పెక్టరు.

* *

ఇన్స్పెక్టరు గుమ్మంలోనే కూచుని లెక్కలు రాస్తున్నాడు పంతులు. కాస్తదూరంలో గుమ్మానికి చేరువగా కూచున్నాడు వెంకన్న.

"బాబూ యీ రాత్రికి వుండిపోతారూ?"

"ఎవడు నడుస్తాడు పదిమైళ్ళదూరం? మళ్ళీ రేపుకూడా రావాలిగా—"

"మరయితే పొద్దు పోతందిగదా, యెక్కడ పడుక్కుంటాము బాబూ?"

"ఎక్కడో ఒకదగ్గర యీ రాత్రి యెలాగో గడిచిపోతే అంతే చాలు—"

"ఏం జమాబందీ బాబూ—మన ప్రాణాలు పోతున్నాయి."

"ఏం చెయ్యడం మరి. ఇంతకీ సంవత్సరానికోసారి కదరా—"

"అవున్లెండి. గాని నాను తెలీకడుగుతాను యీ అధికార్లు మన వూరొచ్చినపుడు మనం యెంతో శ్రమపడి కాఫీలు, ఫలహారాలూ, భోజనాలూ పరుపులూ, మంచాలూ అన్నీ చేస్తాం కదా యిక్కడ మాటాడరేం బాబూ—"

"ఊరుకో వెంకన్నా—"

"అదికాదు బాబూ-మాటన్నా సరిగా రాదు కదా అంట. పోనీ కసిన్ని మంచినీళ్లు అయినా యివ్వరు. ఇందాక ఆ బంట్రోతుగాణ్ణి అడిగితే ఎదురుగుండావున్న నుయ్యి చూపించాడు. ఆ యమ్మ యెవరోగాని, ధర్మాత్ములు యిన్ని నీళ్లు పోసింది—"

"ఎవరి అదృష్టం వాళ్ళది."

"ఏం అదృష్టమో మనం చస్తున్నాం."..

ఇన్స్పెక్టరూ, శేఖరం, బంట్రోతు యింకా కొందరూ వచ్చి గుమ్మం యెక్కారు. ప్రక్కగా కూచున్న పంతులు కాస్త దూరంగా జరిగి కూచున్నాడు.

కుర్చీల్లో కూచున్నారు శేఖరం, ఇన్స్పెక్టరూ ఇంకా మరో ఇద్దరు గుమాస్తాలున్నూ.

"అప్పన్నా వంటయిందేమో కనుక్కో—" ఆర్డరువేశారు ఇన్స్పెక్టరుగారు.

"అబ్బ! ఆకలిగాలేదండీ... భోజనం మానేద్దామనుకుంటున్నాను..." అన్నా డొకగుమస్తా.

"అవునురా... ఇందాక తిన్న టిఫెన్ ఇంకా అరగలేదు" అన్నాడు శేఖరం.

"కొంచెం కడుపు నొప్పిగా వున్నదిరా—" అన్నాడు మరో గుమస్తా...

"కొంచెం కష్టపడి లేచిపోండి. మానెయ్యడం నా కిష్టంలేదు—" అన్నాడు ఇన్స్పెక్టరు ప్రాధేయపూర్వకంగా.

"అంతా రడీసార్" అప్పన్న కేకవేశాడు యింట్లోంచి. నలుగురూ టిప్‌టాప్‌గా లోపలికి వెళ్లిపోయారు.

"రాండి బాబూ మనమూ భోంచేసివద్దాం?" అన్నాడు దురుసుగా వెంకన్న.

ఇన్స్పెక్టరు బంట్రోతు అప్పన్న, వెంకన్న వేపు వెర్రిగాచూస్తూ, మొహం అదోలాపెట్టి గబగబ లోపలికివెళ్ళిపోయి తలుపులువేశాడు.

"ఇంతమంది గుమస్తాలూ కాగితాలు బాగు లేవంటే, ఎలాబాబూ?" అన్నాడు వెంకన్న.

"అదేరా కీలకం—ఆ కాస్తా ఇచ్చెయ్యాలి."

"అదేటి బాబూ—"

"వాళ్లు మనకి ఖర్చుల క్రింద యిచ్చేది, యిచ్చెయ్యాలి."

"ఆఁ... వద్దుబాబూ. ఆళ్ల కెందుకియ్యాలి."

"లేకపోతే పనికాదు..."

"ఊరుకో కలెక్టరుగారు వస్తున్నారు."

వణుకుతూ, కలెక్టరుగారిదగ్గరకి చేరుకున్నాడు

పంతులు. వెంకన్న కాగితాలందిస్తూంటే కలెక్టరు గారి ముందు పెడుతున్నాడు వరసగా.

"యిదేమయ్యా-యీ సిరా అంతాను?"

సంశయంలో పడిపోయాడు పంతులు. ఇన్స్పెక్టరు చేసినది చెప్పడమా? మానడమా? అని...

మళ్లీ కలెక్టరుగారే అన్నారు-"ఇన్స్పెక్టరు గారి రిమార్కులాగవుందే యిది-అబ్బే యేమీ బోధపడ్డంలేదు-ఎవర్రా అక్కడ—"

"చిత్తం..."

ఇన్స్పెక్టరుని పిలవమన్నట్లు సంజ్ఞ చేశాడు.

"ఏంసార్..."

"ఎవరు రాశారుసార్ యిది?"

బిక్కమొహం వేశాడు ఇన్స్పెక్టరు.

"ఓహో తాసిల్దారుగారి రిమార్కు ఇలాగే వున్నది. మీకు ఉద్యోగాలిచ్చినవాణ్ణి అనాలి" విసుక్కున్నాడు కలక్టరు.

వెంకన్న చిరునవ్వు నవ్వేడు.

ఎర్రగా వెంకన్న వేపుచూస్తూ వెళ్ళిపోయాడు ఇన్స్పెక్టరు.

"పంతులుగారూ మీరు యెంతో ఓపికతో రాశారు. కాని ఆ దుర్మార్గుడు పాడుచేశాడు. ముత్యాల్లాంటి అక్షరాలు! ఎంత ఓపిగ్గా రాశావయ్యా-ముసలాడివయినా. ఆల్ రైట్ కానీ."

ఏదో రాశాడు దానిమీద కలక్టరు.

తాసిల్దారు ముఖం ఎర్రబారింది. పంతులు, తాసిల్దారుని చూచి ప్రశ్నార్థకంగా చూస్తూవుండి పోయాడు.

తాసిల్దారు మిగతా వారందరూ ఆశించినదానికి విరుద్ధంగా జరిగింది. తమకి లంచం యివ్వకపోయినా మంచి రిమార్కు పొందేడు పంతులు-అందుకు ఈర్ష్య!

* * *

"బాబూ సెలవు—"

"వెళ్ళండి-తమకి కలక్టరుగారు మిత్రులు—" అన్నాడు తాసిల్దారు.

"ఓహో! ఆయనతో వియ్యమందుతాడండీ యీాయన."

"ఏం బాబూ అలాఅంటున్నారు" అన్నాడు పంతులు అమాయకంగా.

ఫక్కున నవ్వాడు ఇన్స్పెక్టరు.

అప్పన్న అన్నాడు, "తమ కూతుర్ని ఆయన కొడుక్కి యిస్తారు కాబోలు!"

"ఏయ్‌బంట్రోతూ మాటలు తిన్నగారానియ్ జాగ్రత్త" గదమాయించాడు వెంకన్న.

"ఊరుకో వెంకన్నా—ఇది ఒక ప్రవాహం యీ ప్రవాహానికి ఎదురీది ప్రయోజనంలేదు. ఊరుకోవడం మంచిది" అన్నాడు పంతులు.

"కవిత్వం కూడానా—" పకాలున నవ్వేరందరూ.

"ఈసారి మావూరు రావయ్యా..."

యింకా యేదో అనబోయాడు. కాని వూరుకొన్నాడు, పంతులూ, వెంకన్నా వెళిపోతుంటే, తాసిల్దారన్నాడు, "వీళ్ళపని యెలాగన్నా పట్టాలి"

"తొందరెందుకూ-రేపు కలక్షను అన్నా యిగా—"

"అయినా దమ్మిడీ యివ్వకుండా 'రెడ్ మార్కు'?" ఆశ్చర్యంగా అన్నాడు తాసిల్దారు.

---

అంగవికలురైన వారి సముద్ధరణకు ఇండియాలో తీవ్రమైనకృషి చేయబడుతున్నది. కొలంబోప్రణాళిక క్రింద పంపబడిన ఒక ప్రవీణులవర్గం న్యూఢిల్లీలోని ఇర్విన్ ఆస్పత్రిలో ఒక ప్రత్యేక శాఖను ఏర్పాటుచేశారు. ఇంగ్లండులోని ఆస్వెస్ట్రీ ఆస్పత్రికి చెందిన డాక్టర్ రాబర్టురోఫ్ యాజమాన్యంక్రింద ఆ కృషిసాగించబడుతున్నది.

** ** ** **

ఢిల్లీలో నెలకొల్పబడిన 'డిడిటి' ఫ్యాక్టరీ 1953 చివరలో పనిచేయడం ప్రారంభిస్తుంది. సంవత్సరానికి 700 టన్నుల డిడిటిని ఉత్పత్తిచేయాలని అంచనాలు వేసుకొన్నారు. ప్రపంచ శిశుసంక్షేమ సంస్థ, ప్రపంచారోగ్య సంఘం, ఈ ఫ్యాక్టరీని నెలకొల్పడానికి ఇండియా ప్రభుత్వానికి తోడ్పడుతున్నారు.